కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
బుధవారం, మార్చి 11, 2026

360° SINGLE PAGE TOPIC

మావోయిస్ట్ గణపతి

ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్ దగ్గర పడుతున్నది. మరో ఇరవై రోజుల్లో కేంద్రం ప్రకటన చేయబోతున్నది. ఈలోపే ఎలాంటి కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయనే ఆసక్తి నెలకొన్నది. మావోయిస్టు పార్టీలో గణపతి ఆచూకీ మిస్టరీగానే ఉన్నది. ఆయనపై కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు ఫోకస్ పెట్టాయి. పోలీసులకు చిక్కుతారా? లేక సరెండర్ అవుతారా? లేక మిస్సింగ్‌గానే మిగిలిపోతారా? ఇవన్నీ ఇప్పటికి సమాధానం లేని సందేహాలు.

అగ్రనేత గణపతి ఎక్కడున్నారనేది అంతు చిక్కడం లేదు. ప్రభుత్వాల నుంచి అఫీషియల్ ప్రకటన లేకపోవడంతో ఊహాగానాలకు తావిచ్చినట్లయింది. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు.. మరోవైపు గణపతి కుమారుడి ఎమోషనల్ ఆడియో.. వీటి నడుమ గణపతి వ్యవహారం ఏ మలుపు తీసుకుంటుందనేది కీలకంగా మారింది. గణపతి చుట్టూ నెలకొన్న సస్పెన్స్ పై కలం 360 డిగ్రీస్...

తెలంగాణ బ్యూరో, కలం



# ఆ ఒక్కడు ఎక్కడ?

## గణపతి చుట్టూ వీడని సస్పెన్స్

### పార్టీలో ఏకాకిగా..!

మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అజ్ఞాత జీవితం 50 ఏండ్లు. 'పీపుల్స్ వార్'గా కొనసాగుతున్నప్పుడే 1991లో పార్టీలో ఏర్పడిన సంక్షోభం సందర్భంగా అప్పటి ప్రధాన కార్యదర్శి కొండపల్లి సీతారామయ్యతో విభేదాలు పొడసూపాయి. మూడేండ్ల తర్వాత కొండపల్లిని పార్టీ నుంచి బహిష్కరించడంతో ప్రధాన కార్యదర్శి బాధ్యతలను గణపతి చేపట్టారు. అప్పటి నుంచి 2018 వరకు ఆ బాధ్యతల్లోనే కొనసాగారు. ఆయన హయాంలోనే పశ్చిమబెంగాల్‌కు చెందిన 'పార్టీ యూనిటీ' అనే ఎం-ఎల్ పార్టీ, ఆ తర్వాత బిహార్‌కు చెందిన 'మావోయిస్టు కమ్యూనిటీ సెంటర్' (ఎంసీసీ) విలీనం కావడంతో సీపీఐ (ఎం-ఎల్) పీపుల్స్ వార్ పేరు సీపీఐ (మావోయిస్టు)గా మారింది. సుదీర్ఘకాలం పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన గణపతి తనంతట తానుగా అనారోగ్య సమస్యలతో తప్పుకునేందుకు పెట్టిన ప్రతిపాదనను కేంద్ర కమిటీ లోతుగా చర్చించి ఆ స్థానంలో నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును ఎన్నుకున్నది.

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీర్పూర్‌కు చెందిన గణపతి వరంగల్‌లో బీఎడ్ పూర్తి చేశారు. ఎలిగేడు జడ్పీహెచ్ఎస్‌లో టీచర్ ఉద్యోగం చేస్తూనే పార్టీవైపు ఆకర్షితులై అజ్ఞాతంలోకి వెళ్లారు. భార్యను, కొడుకును వదులుకుని ఉద్యమం బాట పట్టారు. అప్పటి నుంచి కుటుంబంతో సంబంధాలు తెగిపోయాయి. ఆ తర్వాత ఆయన తెలంగాణవైపుగానీ, స్వగ్రామంవైపుగానీ రాలేదు. ఎక్కడున్నారో కుటుంబ సభ్యులు, బంధువులకు సైతం తెలియదు. పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లో లేకపోయినా పొలిట్‌బ్యూరోలో జరిగే చర్చలన్నింటిలో పాల్గొంటూ వ్యూహం, ఎత్తుగడలు లాంటి కీలక నిర్ణయాల్లో యాక్టివ్‌గా ఉండేవారు.
- తీవ్ర అనారోగ్య సమస్యలతో అడవిలో తిరగలేని పరిస్థితుల్లో అర్బన్ ప్రాంతంలో షెల్టర్‌లోకి గణపతి వెళ్లారని, మావోయిస్టు పార్టీ భాగస్వామిగా ఉన్న 'కంపోసా' కూటమిలో సభ్యులుగా ఉన్న నేపాల్, ఫిలిప్పీన్స్, భూటాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లోని ఎం-ఎల్ పార్టీల సహకారంతో ఆ దేశాల్లో ఉన్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.
- మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నేతలంతా అటు ఎన్‌కౌంటర్లలో చనిపోవడమో, లొంగిపోవడమో చోటుచేసుకుంటున్న సమయంలో పార్టీలో గణపతి ఏకాకిగా మిగిలిపోయారన్నది కేంద్ర, రాష్ట్ర పోలీసుల భావన. మానసికంగానూ, శారీరకంగానూ యాక్టివ్‌గా లేరని, అచేతన పరిస్థితుల్లో ఇప్పుడు పార్టీని నడిపించేంత శక్తి లేదని, ఆయన ఆలోచించేంత స్థాయిలో కూడా లేరని, కేడర్ కూడా లేని పరిస్థితుల్లో పార్టీ తన ప్రాభవాన్ని కోల్పోయిందని.. పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### ఇంటెలిజెన్స్ అదుపులో ఉన్నారా?

దాదాపు ఐదు దశాబ్దాలుగా అజ్ఞాతంలోనే ఉన్న ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. పీపుల్స్ వార్, మావోయిస్టు ఉద్యమానికి మార్గదర్శిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఆ పార్టీకి గుండెకాయ, కుంభస్థలం అనేది పోలీసుల భావన. పార్టీ నేతలంతా ఆయుధాలు వదిలి, అజ్ఞాత జీవితాన్ని విడిచిపెట్టి పోలీసులకు సరెండర్ అవుతున్న పరిస్థితుల్లో గణపతి వ్యవహారమే ఉత్కంఠగా మారింది. తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసుల అదుపులో ఉన్నారని, ఢిల్లీలో మెడికల్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేదా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందు లొంగిపోతారని, అందుకు ఆయన కొన్ని షరతులు పెట్టారని, అవి కొలిక్కి వస్తే సరెండర్ వ్యవహారం తేలుతుందని.. ఇలాంటి వార్తలు వినిపిస్తున్నాయి.



### ఉద్యమానికి ముగింపుగా గణపతి సరెండర్!

దాదాపు పాతికేళ్ల పాటు మావోయిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన గణపతి పలు పార్టీలను విలీనం చేసుకోవడంలో యాక్టివ్ రోల్ పోషించారు. వివిధ దేశాల వామపక్ష పార్టీలతో సంబంధాలను నెలకొల్పారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ, బెటాలియన్ల ఏర్పాటు, కంపెనీల ఫార్మేషన్, జనతన సర్కార్ ఆచరణ.. వీటన్నింటిలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా గణపతి ముద్రలున్నాయి. పార్టీకి అటు సైద్ధాంతికంగా, ఇటు సైనికంగా డైరెక్షన్ ఇచ్చి దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపి కేంద్ర, రాష్ట్రాల పోలీసు బలగాలకే సవాలు విసిరిన గణపతిని సరెండర్ చేయించినా, అరెస్టు చేసినా పెద్ద మైలురాయిగా నిలుస్తుందన్నది ప్రభుత్వాల అభిప్రాయం. ఆపరేషన్ కగార్ సక్సెస్‌కు, మావోయిస్టు పార్టీ ఎండింగ్‌కు గణపతి వ్యవహారం కొలిక్కి రావడం కీలకంగా మారుతుందన్నది వాటి భావన. సరెండర్‌కు అవసరమైన గ్రౌండ్ ప్రిపేర్ అయిందని, ఇక ముహూర్తం ఫిక్స్ చేయడమే మిగిలిందన్నది తెలంగాణ ఎస్ఐబీ పోలీసుల సమాచారం.

### ఆయన పెట్టే షరతులపైనే మల్లగుల్లాలు

గణపతి సరెండర్ కావడానికి సన్నాహకాలన్నీ పూర్తయ్యాయని, ఇక తేదీని ఖరారు చేయడమే మిగిలిందన్నది తెలంగాణ పోలీసు వర్గాల్లో వినిపిస్తున్న మాట. అయితే సరెండర్ కోసం ఆయన కొన్ని షరతులు పెట్టినట్లు కూడా వార్తలు వెలువడుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లోని జైళ్లలో మగ్గుతున్న మావోయిస్టు ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలని, వారిపైన ఉన్న కేసులన్నింటినీ ఎత్తివేయాలని, విచారణ పేరుతో ఎలాంటి వేధింపులు పెట్టరాదని, వారి భవిష్యత్తు జీవితానికి ప్రభుత్వాలు సహకారం అందించాలని.. ఇలాంటి షరతులు పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి. వీటిపై ఆయా రాష్ట్రాలే కాక ఎన్ఐఏ లాంటి కేసులు ఉన్నందున కేంద్ర హోం శాఖ కూడా స్పష్టమైన విధాన నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంటుందని, దీనిపై స్పష్టత లేని కారణంగానే సరెండర్ వ్యవహారం కొలిక్కి రాలేదన్నది ఆ వర్గాలు సూచనప్రాయంగా తెలిపాయి.

### తెరపైకి నైతికత అంశం

దీర్ఘకాలం పాటు మావోయిస్టు ఉద్యమాన్ని కొసాగించిన క్రమంలో జరిగిన త్యాగాలు, వేలాది మంది కేడర్ తో పాటు లీడర్లు చనిపోవడం, ఆ కుటుంబాలను ఇప్పటికీ జ్ఞాపకాలు వెంటాడుతూ ఉండడం.. వీటన్నింటికి తగ్గట్టు గణపతి తీసుకునే నిర్ణయం కీలకం కానున్నది. ఇంతమంది అమరుల కుటుంబాలకు ఏం సమాధానం చెప్పాలనే ఎమోషన్ కూడా ఆయన తీసుకునే నిర్ణయంలో కీలకంగా మారిందన్నది ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం. షరతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించిన తర్వాత పార్టీని పూర్తిస్థాయిలో రద్దు చేస్తామనే ప్రకటనతో గణపతి బయటకు రావచ్చన్న లీకులూ వెలువడుతున్నాయి. ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటన చేయకపోవడంతో ఇలాంటి వార్తలు, లీకులు, ఊహాగానాలు కంటిన్యూ అవుతున్నాయి. ఈ నెల 31న ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్ ముగుస్తున్నందున ఆ లోపు జరిగే పరిణామాలు, గణపతి వ్యవహారం కొలిక్కి రావడంపై ఉత్కంఠ నెలకొన్నది.